12

# సన్మానం

ఆగదిలో నిశ్శబ్దం—

వాళ్ళు ముగ్గురూ అతనివంక ఆతృతగా చూస్తున్నారు.

అతను కుర్చీలో కొద్దిగా కదిలాడు.

వాళ్ళు ముగ్గురూ తమ తమ కుర్చీల్లో ముందుకు వంగారు - ఏం సమాధానం చెప్తాడో విందామని.

అతను గొంతు సవరించుకున్నాడు.

"నిజం చెప్పాలంటే... నాకు ఈసన్మానాలూ అవీ అంటే యిష్టం లేదండీ..."

ఆముగ్గురిలో ఒక వ్యక్తి అందుకున్నాడు.

"మీరు అలా అంటే ఎలాగండీ?... డబ్బిచ్చి సన్మానం చేయించుకుంటున్న ఈరోజుల్లో సన్మానం చేస్తామంటూ ముందుకు వచ్చిన మమ్మల్ని నిరాకరించడం మాకు నిజంగా చాల ఆశ్చర్యంగా ఉంది. అది మీ నిరాడంబరతకు నిదర్శనం కావచ్చు ...కానీ మీరు మాకోర్కెను మన్నించాలి."

అతను వెంకట్రావు కళామండలి సంస్థకు ప్రెసిడెంటు. అతనికూడా ఉన్న మిగతా ఇద్దరూ చలపతి, గోవిందరాజులు.

మొదటివాడు సెక్రటరీ, రెండవవాడు ట్రెజరర్. వాళ్ళ సంస్థ అయిన కళామండలి తరపున ఆయన్ని సన్మానించాలని నిర్ణ యించుకుని ఆయన అంగీకారం కోసం వచ్చారు.

ఆయన పేరు రవీంద్ర. మంచి రచయిత.

"సాహిత్యానికి సేవ చేస్తున్నవారిని సన్మానించాలనే మీ నిర్ణయం ఉన్నతమైనదే...కానీ నాకంటే మహామహా రచ యితలు ఎందరో ఉండగా వారిని కాదని నేను సన్మానాలు అందుకోవడం ఎంతవరకూ సబబు అని ఆలోచిస్తున్నాను..." అన్నాడు రవీంద్ర.

"మీరు ఎంతో ఉత్తములు కనుక అలా అంటున్నారు... అదే వేరేవాళ్ళయితే నాకంటే మహారచయిత లేడు అన్నట్లు మాట్లాడేవారు..." అని రవీంద్రని అభినందించాడు చలపతి.

"మీతో మాట్లాడిన ఈ కాస్సేపటిలో మాకు మీమీద గౌరవం యింకా పెరిగింది. మీరు సన్మానాలకీ, సత్కారాలకీ ఎంతవరకూ తగునో అది ప్రజలు నిర్ణయిస్తారు. ఈమధ్య పత్రి కల్లో మీరు వ్రాస్తున్న సీరియల్ నవలలు ఒక్కొక్కటి ఒక్కో మణిపూస, మీ కలంతో నవలా సాహిత్యాన్ని ఒక క్రొత్త మలుపు త్రిప్పారు..." అన్నాడు ప్రెసిడెంటు వెంకట్రావు.

"మీ నవలలంటే ప్రజలకి ఎంత యిష్టమో మీ చుట్టూ తిరిగే పబ్లిషర్స్‌కే తెలుసు..."

"మీ నవల సీరియల్‌గా పడితే పత్రిక సేల్సు పెరగా ల్సిందే..."

"మీది ప్రత్యేకమైన శైలి... అది ఒకరికి వచ్చేది కాదు..."

"ఇతివృత్తం ఎన్నికలో మీకు మీరే సాటి..."

"ఆపండాపండి...మీ పొగడ్తలు చాలు... చిరునవ్వు నవ్వాడు రవీంద్ర, "నాకు సన్మానాలు, సభలూ అంటే ఎం దుకో యిబ్బందిగా ఉంటుంది..."

"మాకోసం మీరు ఈ ఇబ్బందిని భరించాలి...ప్లీజ్... మేము మీ అభిమానులం...మీ రచనలు ఒక్కటికూడా విడవ కుండా చదువుతాం...మీ మీద మాకున్న యిష్టాన్ని మీకు సన్మానం చేయడంద్వారా తెలియజెయ్యాలని అనుకుంటు న్నాం..." అన్నాడు గోవిందరావు.

"మీకు నామీద ఉన్న యిష్టం నాకు తెలిసింది...ఇంక సన్మానం ఎందుకూ?..."

"లేదండి...మీకు ఏదైనా సత్కారం ఘనంగా చేస్తేగానీ మాకు తృప్తి ఉండదు ప్లీజ్...మీ అభిమానులకోసమైనా మీరు ఒప్పుకుని తీరాలి..."

"కాదనకండి...ప్లీజ్..."

"ఊ అనండి సార్..."

ముగ్గురూ రవీంద్రని అలా అరగంటనుండీ మొగమాట పెట్టేస్తున్నారు.

రవీంద్ర కొన్నిక్షణాలు ఆలోచనలో పడ్డాడు.

ఒకసారి దీర్ఘంగా నిట్టూర్చి "ఊ" అన్నాడు,

"థాంక్స్వండి..."

రవీంద్రకి నమస్కరించి ముగ్గురూ లేచి నిలుచున్నారు.

* * * * *

ఆదివారం

సాయంత్రం 6 గంటలు

రవీంద్రభారతిలో...

స్టేజి అంతా పూలతో అలంకరించబడి ఉంది. స్టేజిమీద రవీంద్ర కూర్చుని ఉన్నాడు. అతనికి ఎడమప్రక్కగా మంగళ వాద్యాలు మ్రోగుతున్నాయి.

మంత్రిగారు మందగమనంతో వచ్చి రవీంద్రకు శాలువ కప్పారు,

హాలంతా చప్పట్లు మ్రోగాయి.

క్లిక్...క్లిక్...క్లిక్...

మంత్రిగారు రవీంద్రకు శాలువ కప్పుతుండగా పత్రికల ఫొటోగ్రాఫర్ల కెమేరాల ఫ్లాష్‌లు జిగేల్‌మంటూ వెలిగాయి. ఆఫొటోలు మర్నాడు అన్ని పత్రికలలో వస్తాయి. రవీంద్ర గురించి కాకపోయినా మంత్రిగారి గురించైనా ఆ ఫొటోలు పత్రికల్లో ప్రచురణ కాక తప్పదు.

అంతేకాదు—

ఆ సన్మాన సభని టీ. వి. కూడా కవర్ చేస్తుంది. మళ్ళీ రవీంద్ర గురించి కాకపోయినా మంత్రిగారి గురించైనా...

శాలువా కప్పేటప్పుడు మంత్రిగారు టి. వి. కెమెరాకి ఒక యాంగిల్ పడేశారు.

మంత్రులు ఎక్కడికి వెళ్తే టి వి వాళ్ళు అక్కడికి వెళ్ళి కవర్ చేస్తుంటారు కాబట్టి కెమేరాకి యాంగిల్ పారేయడం మంత్రిగారికి బాగా అలవాటు అయిపోయింది.

తరువాత-సన్మానం సందర్భంగా ప్రచురించిన సావనీర్ ని మళ్ళీ కెమేరాలకి నవ్వులూ యాంగిల్సూ పడేస్తూ మంత్రిగారు ఆవిష్కరించారు.

హాలంతా మళ్ళీ చప్పట్లు.

ఆ సావనీర్ నిండా రవీంద్ర గురించి నగరంలోని ప్రముఖులు వెలిబుచ్చిన అభిప్రాయాలు, వ్యాసాలూ ఉన్నాయి. రవీంద్రగుండె సంతోషంతో పొంగిపోయింది.

''ఇప్పుడు గౌరవనీయులైన మంత్రివర్యులు రచయిత రవీంద్రగారి గురించి మాట్లాడతారు''

మైకులో అనౌన్స్‌మెంటు వినబడింది.

మంత్రిగారు మైకు నడుంచుట్టూ చేతులేసి దగ్గరకు లాక్కున్నారు.

''మహాజనులారా! ఈ సభకు నన్ను అధ్యక్షుడిగా పిలిచి

నందుకు చాల సంతోషిస్తున్నాను. ఎందుకంటే సాయిత్యం అంటే నాకు చాల యిష్టం...రచయితలన్నా, కవులన్నా కూడా మరీమరీ యిష్టం. అందుకే రచయిత అయిన...రచయిత అయిన ...రచయిత..."

వెనక్కి తిరిగి బుర్ర గోక్కున్నారు మంత్రిగారు-ఎవరో అందించారు.

"ఆ...రచయిత అయిన రవీంద్రగారి సన్మానానికి పిలవడం నాకెంతో ఆనందంగా ఉంది...ఈ సన్మానం ఆయన క్కాదు...నాకే చేసినంత యిదిగా...ఎంతో అదిగా...చాల యిదిగా ఉందని మనవిచేసుకుంటున్నాను..."

హాలంతా చప్పట్లు.

"...మరి మనలో చాలమందికి బిర్యాని అంటే యిష్టం ఉండొచ్చు...కాని బిర్యాని వండటం రాకపోవచ్చు. అట్లాగే నాకు సాయిత్యం అంటే చాల యిష్టం - కాని సాయిత్యం గురించి ఏమీ తెలీదు..."

చప్పట్లు...

"కాబట్టి మహాజనులారా ... ఇంతటితో నా ఉపన్యా సం ముగించేస్తున్నాను. నన్ను ఈ కార్యక్రమానికి ఆహ్వానిం చిన...ఆహ్వానించిన...ఆహ్వానించిన..."

"మళ్ళీ వెనక్కి తిరిగి బుర్ర గోక్కున్నారు మంత్రిగారు. ఎవరో మళ్ళీ అందించారు.

"ఆ...ఆహ్వానించిన కళామండలివారికి ధన్యవాదాలు తెలుపుకుంటూ శలవు తీసుకుంటున్నాను..."

హాలంతా మళ్ళీ చప్పట్లతో మారుమ్రోగింది.

"తరువాత కళామండలి సెక్రటరీ అయిన చలపతి రవీంద్ర గురించి రెండు మాటలు మాట్లాడతారు."

సభికులకు నమస్కారం...

ఇది రాకెట్ యుగం. ఎక్కడ చూసినా స్పీడ్, మన జీవితంలో స్పీడ్ పెరిగిపోయింది. ఎవరి పనుల్లో వాళ్ళు బిజీగా ఉంటారు...తాపీగా కళను ఆస్వాదించేవాళ్ళు రోజురోజుకూ కరువై పోతున్నారు. కళలకు ఉన్న విలువలు తరిగిపోతున్నాయి. ఈ తరుణంలో కళకు ఇంతో అంతో సేవచేసే ఉద్దేశంతో ఈ సంస్థను స్థాపించాము. సాహిత్యం, చిత్రలేఖనం, నృత్యం, నటన మొదలైన రంగాల్లో కృషిచేస్తున్న వారిని సన్మానించాలన్నది మా కళామండలి ముఖ్యోద్దేశాలలో ఒకటి. సాహిత్య రంగంలో ఎవరిని సన్మానించాలి అని అనుకోగానే వెంటనే రవీంద్రగారి పేరే మా మనసుల్లో మెదిలింది..."

"అవును...ఆయన సాహిత్యానికి చేసినసేవ అపారమైనది. ఇంకా ఆయన భవిష్యత్తులో ఎంతో చేస్తారుకూడా. రవీంద్రగారి నవలలు చదవని ఆంధ్రుడు ఉండడు అంటే అతిశయోక్తి కాదు. ఒక్కో నవల ఒక్కో ఉద్గ్రంధం....పొగ త్రాగనివాడు దున్నపోతై పుడతాడో పుట్టడోగాని రవీంద్రగారి నవలలు చదవనివాడు మాత్రం తప్పకుండా మరోజన్మలో దున్నపోతై పుడతాడు (జనం చప్పట్లు నవ్వులు...). రవీంద్ర

గారి కలానికున్న పదును ఆంధ్రదేశంలో ఎంతమంది రచయితల కలాలకి ఉంది...ఆయనది ఒక ప్రత్యేకమైన శైలి...ఆశైలి అనితరసాధ్యం...ఆయన..."

అలా ఒక పావుగంటసేపు చలపతి రవీంద్రని ఆకాశానికి ఎత్తేస్తూ ఉపన్యసించాడు. తరువాత మరికొంతమంది రవీంద్రని, ఆయన రచనలనీ అమితంగా పొగుడుతూ ఉపన్యసించారు.

ఉపన్యాసాలు అయినతరువాత వరుసగా ఒకరి తరువాత ఒకరు రవీంద్ర మెడలో దండలువేసి అతన్ని కప్పేశారు. వారి అభిమానానికి రవీంద్ర కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

సాహిత్యానికి విలువేమీ తరిగిపోలేదు. ఒక మంచి రచయితకు ఈ సమాజంలో ఉన్నతస్థానం ఎప్పుడూ ఉంటుంది.

తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు రవీంద్ర.

చివరిగా రవీంద్ర రచించిన నాటకాన్ని ప్రేక్షకుల ఎదుట ప్రదర్శించారు కళామండలి సభ్యులు.

అంతటితో సన్మానసభ సమాప్తమైంది.

కళామండలి ప్రెసిడెంటు వెంకట్రావు రవీంద్రని కారులో ఇంటిదగ్గర దించి ఆయనకు థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు.

మర్నాడు అన్ని పత్రికల్లో రవీంద్ర సన్మానానికి సంబంధించిన న్యూస్ వచ్చింది. కొన్ని పత్రికల్లో అతను మంత్రితో శాలువా కప్పించుకుంటున్న ఫొటోకూడా పడింది.

ఇంటిదగ్గర తీరుబడిగా సన్మాన సంచికలో తన గురించి పలువురు వ్రాసిన అభిప్రాయాలు చదివిన రవీంద్ర కళ్ళల్లో ఆనందభాష్పాలు ఉబికాయి.

వీళ్ళకి తనంటే ఎంత అభిమానమో!!......

*　　*　　*　　*　　*

కళామండలి ఆఫీసులో......

"సావనీర్ ప్రింటింగ్‌కి రెండువేలు, సన్మానానికి వెయ్యి మొత్తం మూడువేలు ఖర్చయింది. సావనీర్‌లో ప్రచురించిన ఎడ్వర్‌టైజ్‌మెంట్లకి మొత్తం పదిహేనువేలు వచ్చింది. అంటే పన్నెండువేలు మిగిలినట్టు లెక్క. మనం ముగ్గురం నాలుగేసి వేలు తీసుకోవచ్చు. ... వచ్చేనెల ఎవరినైనా సంగీత విద్వాంసుడిని సన్మానిద్దాం..." అంటున్నాడు కళామండలి ప్రెసిడెంటు వెంకట్రావు చలపతి, గోవిందరావులతో.

25-2-82, ఆంధ్రభూమి.